సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



..రక్షణ చర్యలు పాటించాలి

రోజురోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి కూలీలు రక్షణ చర్యలు పాటించాలని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. 8లో



మిర్చి రైతులకు కన్నీరే

ఎన్నో ఆశలతో పండించిన మిర్చి ధర రోజురోజుకూ తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 20°

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

డీఈఓ వెంకటేశ్వరా చారి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

మణుగూరు రూరల్ : ప్రకృతిని పరిరక్షించడం అందరి బాధ్యత అని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. మండలంలోని సాంబాయిగూడెంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేచర్ క్యాంప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులు, ఇతర అంశాలపైనా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ మేరకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. నేచర్ క్యాంప్ వంటి కార్యక్రమాలతో విద్యార్థులు ప్రకృతి, నీరు, నేల, వాయువులు, మొక్కలు వంటివి పరిశీలించే అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు, రాష్ట్ర ఎన్‌జీఓ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ నేచర్ క్యాంప్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు గ్రీన్ టీ షర్టులు, వాటర్ బాటిళ్లు, టోపీలు, కాటన్ సంచులు, పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. సాంబాయిగూడెం, రామానుజవరం, మణుగూరు, పినపాక, ఏడూళ్లబయ్యారం జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమంలో మణుగూరు ఎంఈఓ జి.స్వర్ణజ్యోతి, జిల్లా ఎఫ్ఏఓ ఎస్.శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం ఎం. శ్రీలత, గైడ్ టీచర్లు వి. కోటేశ్వరరావు, బి.రామిరెడ్డి, కె.రామారావు, టి.కోటేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

జేవీఆర్ సీహెచ్‌పీని పరిశీలించిన డైరెక్టర్



సీహెచ్‌పీలో పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సత్తుపల్లిలోని జేవీఆర్ సీహెచ్‌పీని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) పీపీ) కె.వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొగ్గు రవాణా, కోల్ రిసీవింగ్ కాంప్లెక్స్ వద్ద అన్‌లోడింగ్ సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఆ తర్వాత కోల్ ఏరియా, డిశ్చార్జి పాయింట్‌ను కూడా పరిశీలించారు. సీహెచ్‌పీ నుంచి దుమ్ము వెలువడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఏరియా జీఎం శాలేంరాజుతో చర్చించారు. కార్యక్రమంలో అధికారులు సూర్యనారాయణ, కోటిరెడ్డి, రామకృష్ణ, ఆర్.ప్రహ్లాద్, నర్సింహారావు, కె.సోమశేఖర్ పాల్గొన్నారు.

పర్మిట్లతో పనేంటి ?

దేశవ్యాప్తంగా సరుకుల రవాణాలో లారీలది కీలక పాత్ర. స్టేట్ పర్మిట్, నేషనల్ పర్మిట్ రూపంలో సరుకు రవాణా చేసేందుకు లారీ యజమానులకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేస్తుంది. స్టేట్ పర్మిట్ పొందిన లారీ ఆ రాష్ట్రంలో మాత్రమే సరుకులు రవాణా చేయాల్సి ఉంటుంది. నేషనల్ పర్మిట్ కలిగిన లారీ ఒక రాష్ట్రంలోని సరుకు తీసుకుని మరో రాష్ట్రంలో రవాణా చేయొచ్చు. ఆయా లారీలకు మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో ప్రభుత్వం పర్మిట్లు మంజూరు చేస్తుంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



అశ్వారావుపేటలోని ఆర్టీఏ చెక్‌పోస్టు (ఇన్‌సెట్) సరుకు రవాణా చేస్తున్న లారీలు





ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో బడా కంపెనీల హవా..

- సరుకు రవాణా నిబంధనలు బేఖాతర్
- నేషనల్ పర్మిట్ లారీలతో నష్టపోతున్న స్థానికులు
- చోద్యం చూస్తున్న రవాణా శాఖ

నిబంధన ఉల్లంఘిస్తే నేరమే..

రవాణా శాఖ నిబంధనల ప్రకారం ఒక రాష్ట్రంలో అనుమతి పొందిన లారీ ఆ రాష్ట్రం దాటి ఇతర ప్రాంతాల్లో లోడింగ్, అన్‌లోడింగ్ లేదా రవాణా చేస్తూ పట్టుబడితే నేరంగా పరిగణిస్తారు. అలాగే నేషనల్ పర్మిట్ పొందిన లారీ రెండు రాష్ట్రాల మధ్య సరుకు రవాణా చేయకుండా ఒక రాష్ట్రంలో లోడ్ చేసుకుని అదే రాష్ట్రంలో అన్‌లోడ్ చేయడం కూడా నేరంగానే పరిగణిస్తారు. ఆర్టీఏ అధికారులు తనిఖీ చేసినప్పుడు ఇలా పట్టుబడిన లారీలకు భారీ మొత్తంలో జరిమానా విధిస్తారు.

జిల్లా మీదుగా వందల లారీలు..

భద్రాద్రి జిల్లా ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది. ఈ జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వీటితో పాటు సింగరేణి, థర్మల్ పవర్ స్టేషన్లు, నవ లిమిటెడ్, భద్రాచలం పేపర్ బోర్డు, పామాయిల్ పరిశ్రమలూ ఉన్నాయి. దీంతో నేషనల్ పర్మిట్లు పొందిన వందలాది లారీలు జిల్లా మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఇతర రాష్ట్రాల్లో కేంద్ర కార్యాలయాలు ఉన్న పలు కంపెనీలు నేషనల్ పర్మిట్ కలిగిన తమ లారీలను ఈ జిల్లా కేంద్రంగా ఆపరేట్ చేస్తున్నాయి. జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ చెక్‌పోస్టుల గుండా వెళ్లే ప్రతీ సరుకు రవాణా వాహనాన్ని ఆపి తనిఖీ చేయాల్సి ఉంటుంది.

కాసులిస్తే సరి..

నేషనల్ పర్మిట్ ఉన్న లారీలు జిల్లాలో సరుకు లోడ్ చేసుకుని హైదరాబాద్‌లో అన్‌లోడ్ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే కేసు బుక్ చేయాల్సి ఉంటుంది. అదే విధంగా మరోసారి ఇలాంటి పని చేయకుండా కనీసం మూడు నెలల వరకు స్టేట్ పర్మిట్ తీసుకునేలా చూడడంతో పాటు అదనంగా జరిమానా కూడా విధించాలి. కానీ జిల్లాలో ఉన్న రెండు చెక్‌పోస్టుల్లో ఇలాంటివేమీ జరడగం లేదు. నిబంధనలు ఉల్లంఘనకు ప్రతిఫలంగా లారీకి ఇంత అని రవాణా శాఖ తనిఖీ కేంద్ర సిబ్బంది చేతులను కాసులతో తడిపితే సరిపోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాల్వంచ తనిఖీ కేంద్రంపై లెక్కకు మిక్కిలి ఈ తరహా ఆరోపణలు వస్తున్నాయి.

రాష్ట్రంలోనే రవాణా..

గోదావరి తీరం వెంట విస్తరించిన ఓ భారీ పరిశ్రమ తన అవసరాల కోసం రవాణా రంగంలో ఉన్న కంపెనీల నుంచి బిడ్లు ఆహ్వానించింది. దేశ వ్యాప్తంగా పేరున్న పలు కంపెనీలు ఈ బిడ్‌లో పాల్గొని టెండర్ దక్కించుకున్నాయి. నాలుగైదు కంపెనీలకు చెందిన సుమారు 150 లారీలు ఈ పరిశ్రమ కేంద్రంగా రవాణా రంగంలో సేవలు అందిస్తున్నాయి. ఇవన్నీ నేషనల్ పర్మిట్ కలిగిన లారీలే. అయితే ఇందులో సుమారు 120 లారీలు నిబంధనలు ఉల్లంఘిస్తూ సదరు పరిశ్రమ ఉత్పత్తులను హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ముఖ్య పట్టణాలకూ రవాణా చేస్తుండడం గమనార్హం.

స్థానికులకు నష్టం..

ఇక్కడున్న పరిశ్రమలను నమ్ముకుని అనేక మంది బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని సొంతంగా లారీలు కొనుగోలు చేశారు. బడా కంపెనీలకు చెందిన నేషనల్ పర్మిట్ లారీలు నిబంధనలు అతిక్రమిస్తూ సరుకు రవాణా చేయడంతో జిల్లాకు చెందిన స్థానిక లారీ యజమానులకు రావాల్సిన ట్రాన్స్‌పోర్టు ఆర్డర్లు దారి తప్పుతున్నాయి. దీంతో నెలవారీ కిస్తీలు కట్టడం కూడా కష్టంగా మారిందని స్థానిక లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ అంశంపై వివరణ కోసం జిల్లా రవాణా శాఖ అధికారిని ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

లక్ష్య సాధనకు కష్టపడి చదవాలి

పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో ఎన్ని మార్కులొస్తాయని ఆలోచించకుండా కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రేరణ, శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు పదో తరగతి అనేది ఒక మెట్టు మాత్రమేనని, అదే ప్రామాణికం కాదని అన్నారు. ఆ తర్వాత ఇంకా అనేక కోర్సులు చదవాల్సి ఉంటుందన్నారు. ఏ తరగతిలో అయినా నిరంతరం కష్టపడితేనే లక్ష్యాన్ని చేరుకోవచ్చని చెప్పారు. తాను కూడా విద్యార్థి దశలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని, పదో తరగతి చదివేటప్పుడు ఇంజనీర్ అవుదామనుకున్నానని, ఆ తర్వాత తన లక్ష్యాన్ని మార్చుకుని పట్టుదలతో చదివి ఐఏఎస్ సాధించానంటూ తన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థులు మంచి జీవితం కోసం ప్రేరణ కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, వసతి గృహాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి నుంచి సమయాన్ని వృథా చేయకుండా బాగా చదివి పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులు, వార్డెన్లకు సూచించారు. అనంతరం విద్యాశాఖ రిసోర్స్ పర్సన్లు సైదులు, నాగరాజశేఖర్, నాగరాజు, విజయ భాస్కర్, శ్యాం చందర్‌రావు విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో మెళకువలు నేర్పారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూయ, ఏఎస్‌డబ్ల్యూఓలు హనుమంతరావు, సునీత, హెచ్‌డబ్ల్యూఓలు గజ్వేల్ శ్రీనివాస్, పద్మావతి, శశిరేఖ, కౌసల్య, రామనరసయ్య, స్వప్న, కార్యాలయ సిబ్బంది నరసింహారావు, పార్వతి శశికళ, హేమంత్, సాయి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూస్తాం

సూపర్‌బజార్(కొత్తగూడెం): రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా చూస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. నీటి సమస్య – తీసుకోవాల్సిన కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాగు, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్ష జరుపుతున్నామని చెప్పారు. అర్హులందరికీ రైతు భరోసా అందేలా చర్యలు చేపడుతున్నామని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే కొత్త రేషన్ కార్డులు అందించేలా ప్రణాళిక రూపొందించామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, మిషన్ భగీరథ ఈఈలు తిరుమలేష్, నళిని, విద్యుత్ ఎస్ఈ జి.మహేందర్, నీటి పారుదల శాఖ ఈఈ రాంప్రసాద్, పౌరసరఫరాల శాఖల అధికారులు త్రినాధ్‌బాబు, రుక్మిణి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

కోల్ మూమెంట్ ఈడీగా సుభాని

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కోల్ మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా సింగరేణి భవన్‌లో జీఎంగా విధులు నిర్వహిస్తున్న సుభానికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈడీగా విధులు నిర్వహించిన అల్విన్.. తన మాతృసంస్థ అయిన ఐఆర్ఎస్‌కు వెళ్లిపోగా, కొంత కాలంగా ఈడీ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో బొగ్గు రవాణాకు ఇబ్బంది కలుగుతుండడంతో సుభానికి బాధ్యతలు అప్పగిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది.

ఆశ్రమ పాఠశాలలను బలోపేతం చేస్తాం

ఐటీడీఏ పీఓ రాహుల్



విద్యార్థినులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

చంద్రుగొండ : ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలను బలోపేతం చేస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలల్లో మూడు నెలలుగా చేపడుతున్న ఉద్దీపకం కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని తెలిపారు. 3, 4, 5 తరగతుల వారు ఆంగ్లం, గణితంలో పట్టు సాధించేందుకు ఇది ఉపకరిస్తోందన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. తొలుత తిప్పనపల్లి గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శించిన పీఓ విద్యార్థులతో మాట్లాడారు. కలెక్టర్ అంటే ఎవరు.. కలెక్టర్ కావాలంటే ఏం చదవాలంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా పాటిస్తున్నారా అని ఆరా తీశారు. వర్షం వస్తే భవనం కురుస్తోందని, మరుగుదొడ్లు భవనానికి దూరంగా ఉన్నాయని, కోతుల బెడద ఉందని ప్రిన్స్‌పాల్ సునీత, విద్యార్థినులు చెప్పగా వెంటనే ఈ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

సూక్ష్మ పరిశ్రమలపై దృష్టి సారించాలి

భద్రాచలం: సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలతో జీవనోపాధి కలుగుతుందని, వాటిపై గిరిజనులు దృష్టి సారించాలని పీఓ రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలో ఎంఎస్ఎంఈ యూనిట్ సభ్యులకు శిక్షణ నిర్వహించగా పీఓ మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఎంఎస్ఎంఈ పథకం ద్వారా చిన్న తరహా పరిశ్రమలను సబ్సిడీ ద్వారా అందిస్తామని తెలిపారు. యూనిట్ సభ్యులు సమష్టిగా పని చేసి నాణ్యమైన వస్తువులు ఉత్పత్తి చేయాలని సూచించారు. ముడి సరుకును తక్కువ ధరకు కొనుగోలు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని చెప్పారు. ఈ వస్తువులను ట్రైబల్ మ్యూజియం వద్ద విక్రయానికి త్వరలో అనుమతి ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, సీఈఓటీడీ సంస్థ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, శిక్షకుడు విజయ్‌కుమార్, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు

మ్యూజియం ఆధునికీకరణ

మార్చి నాటికి ట్రైబల్ మ్యూజియం ఆధునికీకరణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని పీఓ తెలిపారు. మ్యూజియం పనుల పరిశీలన అనంతరం మాట్లాడుతూ.. మ్యూజియం సందర్శనకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ఏటీడీఓ అశోక్‌కుమార్, డీఎస్ఓ ప్రభాకర్‌రావు, డీఈ హరీష్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి పాల్గొన్నారు.

స్తంభాద్రి గిరిప్రదక్షిణ.. వైభోగం

- దారి పొడవునా స్వామికి భక్తుల నీరాజనం
- ఆపై నక్షత్ర జ్యోతి దర్శనం





భక్తుల కోలాహలం మధ్య సాగుతున్న గిరిప్రదక్షిణ (ఇన్‌సెట్) కొండపై వెలుగుతున్న దివ్యజ్యోతి

ఖమ్మంగాంధీచౌక్: అరుణాచలం, యాదగిరిగుట్ట మాదిరిగానే ఖమ్మంకు మూలమైన త్రేతాయుగం నాటి స్వయంభూ దివ్య క్షేత్రం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతీనెలా గిరి ప్రదక్షిణ నిర్వహించాలని నిర్ణయించగా మంగళవారం వేలాది మంది భక్తుల నడుమ నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారిని సతీసమేతంగా ఆలయం నుంచి పల్లకీపైకి చేర్చి గుట్ట కిందకు తీసుకొచ్చాక భజనలు, కోలాటాల నడుమ గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. వేలాదిగా హాజరైన భక్తులు నృసింహ నామ స్మరణకు తోడు కీర్తనలు ఆలపిస్తూ పాల్గొన్నారు. స్తంభాద్రి ఘాట్ రోడ్డు గేటు వద్ద ప్రారంభమైన ప్రదక్షిణ ఎన్నెస్పీ రోడ్, కవిత డిగ్రీ అండ్ పీజీ కళాశాల, స్తంభాద్రి మండపం, సరిత క్లినిక్, ఎల్ఐసీ కార్యాలయం మీదుగా తిరిగి గేట్ నుంచి ఘాట్ రోడ్ ద్వారా గుట్టపై ఆలయం వద్దకు చేరింది. ఆతర్వాత ఆలయం పక్కన కొండపై నక్షత్ర జ్యోతిని అర్చకులు వెలిగించారు. ప్రతీనెల స్వాతి నక్షత్రం రోజున సాయంత్రం గిరి ప్రదక్షిణ ఉంటుందని ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామితో పాటు భక్త మండళ్ల బాధ్యులు, అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ కాల్వలో మొసలి



కాల్వ ఒడ్డుకు వచ్చిన మొసలి

పాల్వంచరూరల్ : పది రోజుల వ్యవధిలోనే కేటీపీఎస్ కాల్వలో రెండు మొసళ్లు కనిపించడంతో పర్యాటకులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు కూడా మొసళ్లను చూసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని జలాశయం నుంచి కేటీపీఎస్ విద్యుత్ కర్మాగారానికి నీరు సరఫరా అయ్యే కాల్వలో మంగళవారం మరో మొసలి కనిపించింది. దాన్ని చూసిన పర్యాటకులు భయపడి అక్కడి నుంచి పరుగెత్తారు. అధికారులు వెంటనే స్పందించి కేటీపీఎస్ కాల్వలో సంచరిస్తున్న మొసలిని పట్టుకుని ఇతర ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

ఏసీబీ వలలో అటవీ అధికారులు

రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎఫ్‌ఆర్‌ఓ, ఎఫ్‌బీఓ



ఏసీబీకి పట్టుబడిన ఎఫ్‌ఆర్‌ఓ ఉదయ్‌కిరణ్, ఎఫ్‌బీఓ హరిలాల్

ఇల్లెందురూరల్ : అటవీ భూముల నుంచి మట్టి తరలించేందుకు రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఎఫ్‌ఆర్‌ఓ, ఎఫ్‌బీఓ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ ఘటన ఇల్లెందు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలతో పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారడంతో మండలంలోని బోడుతండా, కొమరారం, పోచారం తండా గ్రామాల రైతులు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ద్వారా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీంతో కలెక్టర్ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్ నుంచి ఒక్కో గ్రామానికి రూ.1.50 లక్షల చొప్పున విడుదల చేశారు. పొలాలకు వెళ్లే రహదారులపై గ్రావెల్ పోసుకోవాలని సూచించారు. దీంతో బోడుతండాకు చెందిన ఓ రైతు ఈ ఏడాది సంక్రాంతి రోజున మట్టి కోసం అటవీ ప్రాంతానికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న కొమురారం ఎఫ్‌ఆర్‌ఓ ఉదయ్‌కిరణ్, ఎఫ్‌బీఓ హరిలాల్ మట్టి తరలింపును అడ్డుకుని జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. దీంతో రైతు రూ.15వేలు ముట్టజెప్పి జేసీబీని విడిపించుకున్నాడు. ఆపై మొరం తోలకానికి అనుమతి ఇవ్వాలని అటవీ అధికారులను వేడుకోగా రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. చివరకు బతిమిలాడి రూ.20 వేలు చెల్లించి పనులు ప్రారంభించాడు. అయితే పొలాలకు నీరు పెడుతుండడంతో ఆ దారిలో ట్రాక్టర్ వెళ్లేందుకు వీల్లేక కొన్ని రోజులు పనులు నిలిపివేసి, వారం క్రితం మట్టి తోలుకుంటున్నట్టు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. మిగిలిన రూ.30 వేలు ఇస్తేనే మట్టి తీసుకెళ్లాలని వారు ఖరాఖండిగా చెప్పడంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మంగళవారం రూ.30 వేలు తీసుకుని అటవీ రేంజ్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ఎఫ్‌ఆర్‌ఓ సూచనతో ఎఫ్‌బీఓకు నగదు ఇస్తుండగా మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

తీరు మారని అటవీశాఖ..

అవినీతికి పాల్పడి సొంతశాఖ అధికారుల విచారణలో అక్రమాలు వెలుగుచూడటంతో కొందరు అటవీ అధికారులు సస్పెన్షన్లకు గురవుతున్నారు. ఈ తతంగం ఇల్లెందు అటవీ డివిజన్‌లో వరుసగా చోటుచేసుకుంటోంది. అయినా అధికారుల్లో మార్పు రావడం లేదు. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమే అయినా కొందరు అధికారులు ఎంతో కొంత ముట్టజెప్పనిదే పని చేయడం లేదు. తాజాగా కొమరారం ఎఫ్‌ఆర్‌ఓ, ఎఫ్‌బీఓ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడగా.. గత నెలలో మైనారిటీ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిబ్బందికి వేతనం ఇచ్చే విషయంలో రూ.2వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయాడు. ఆరు నెలల క్రితం అవినీతికి పాల్పడడంతో అటవీశాఖ ఇల్లెందు డివిజన్ అధికారి కర్నావత్ వెంకన్నను ఏకంగా విధుల నుంచి తొలగించారు. ఇంకా మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు సైతం ఏసీబీకి చిక్కారు.

అటవీశాఖలో సస్పెన్షన్ల పర్వం..

ఏడాది క్రితం జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంలో చోటుచేసుకున్న అక్రమాల ఆరోపణలతో ఇల్లెందు రేంజ్ ధర్మాపురం బీట్ అధికారి చందూలాల్, గుండాల మండలం కాచనపల్లి రేంజ్ పరిధిలోని జగ్గుతండా బీట్ అధికారి హనుమంతు, నారవేప కలప మాయమైన ఆరోపణలతో డీఆర్‌ఓ బేగం, కాచనపల్లి రేంజ్ పెద్దతోగు బీట్ అధికారి నిర్మల అక్రమాలకు పాల్పడి సస్పెన్షన్‌కు గురయ్యారు. మూడేళ్ల క్రితం ఇల్లెందు రేంజ్ అధికారి రవికిరణ్, డీఆర్‌ఓలు సుక్కి, జయరాం, బీట్ అధికారి సైతం సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఇలా పలువురు అధికారులపై వేటు పడుతున్నా.. ప్రస్తుతం విధుల్లో ఉన్నవారు తమ పనితీరును మార్చుకోకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

ఇంటి నిర్మాణానికి అడ్డుకట్ట



ఆర్ఐతో మాట్లాడుతున్న గ్రామస్తులు, దేవస్థానం అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాలలో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని దేవస్థానం అధికారులు అడ్డుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముత్తి గురుమూర్తి సర్వే నంబర్–1లోని ఐదు సెంట్ల భూమిలో ఇంటి నిర్మాణం చేపడుతుండగా పర్ణశాల దేవస్థానం అధికారులు.. ఆ స్థలం ఆలయానికి సంబంధించినదని నిర్మాణాన్ని అడ్డుకున్నారు. గురుమూర్తి 2010లో ఆ స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన చాట్ల రామకృష్ణారెడ్డి వద్ద కొన్నానని చెబుతున్నాడు. కాగా దేవస్థానం అధికారులు ఈ స్థలానికి సంబంధించిన పట్టా చూపించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకుని దేవస్థానం అధికారులు చూపించిన ఆధారాలను పరిశీలించి.. ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని సూచించారు. బాధితుడి వద్ద సరైన ఆధారాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని, అప్పటివరకు ఇరు వర్గాల వారు ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని పేర్కొన్నారు.

ఈత కొట్టిన ఎమ్మెల్యే..!



కొలనులో ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: పట్టణంలోని లేక్‌వ్యూ పార్క్‌లో నిర్మించిన కొలనులో స్విమ్మింగ్ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య ఈత కొట్టి అందరినీ ఉత్సాహపరిచారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, పలువురు కాంగ్రెస్ నేతలు, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

ఖేలో ఇండియా ఆర్చరీ పోటీల్లో ప్రతిభ



కనకం లోహితశ్రీ

దమ్మపేట: బెంగళూరులో ఇటీవల నిర్వహించిన ఖేలో ఇండియా సౌత్ జోన్ ఆర్చరీ పోటీల్లో దమ్మపేట మండలం పట్వారి గూడెంనకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కనకం లోహితశ్రీ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం దక్కించుకుంది. ఆమె రికర్వ్ విభాగంలో పతకం గెలుచుకోగా పలువురు అభినందించారు. ప్రస్తుతం లోహితశ్రీ హైదరాబాద్ హకీంపేటలోని ప్రభుత్వ క్రీడా పాఠశాలలో చదువుతోంది.

26నుంచి రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

చింతకాని: మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26నుంచి మండలంలోని నేరడలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని నేతాజీ యువజన సంఘం కార్యదర్శి దూసరి గోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్ల బాధ్యులు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈనెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచేవారికి వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30వేలతో పాటు ఎనిమిదో స్థానం వరకు నిలిచే జట్లకు సైతం నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 70939 00119, 93945 71739, 80084 92173 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సత్యనారాయణపురంలో చోరీ

చర్ల: మండలంలోని సత్యనారాయణపురంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఎస్.రాముకు చెందిన ఇంట్లో ఎవ్వరూ లేని సందర్భంలో దొంగలు చొరబడి బీరువాను ధ్వంసం చేశారు. తలుపులు తెరిచి ఉండడాన్ని ఇంటి పక్కవారు గుర్తించి హైదరాబాద్‌లో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు విషయం చెప్పారు. సీఐ రాజువర్మ, ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఏ మేరకు చోరీ జరిగిందనే విషయం కుటుంబ సభ్యులు వస్తే తెలుస్తుందని పోలీసులు చెప్పారు. క్లూస్‌టీం కూడా వచ్చి ఇంటి పరిసరాలను పరిశీలించింది. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని జ్యూయలరీ దుకాణాల్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడగా అదేరోజు ఈ ఘటన జరిగిందా? తరువాత రోజు జరిగిందా? అనే దానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

మిట్టగూడెంలో..

అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెం గ్రామంలో ఒంకోజు బ్రహ్మచారి ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బ్రహ్మచారి కుటుంబ సభ్యులు సూర్యాపేట జాతరకు వెళ్లగా రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో చొరబడి చోరీ చేశారు. ఏమేమి పోయాయో తెలియాల్సి ఉంది.

మిర్చి రైతులకు కన్నీరే

ధరల పతనంతో దిగాలు

- పెరుగుతున్న కూలీ రేట్లు
- తెగుళ్లతో తగ్గుతున్న దిగుబడులు



కల్లాల్లో ఆరబోసిన మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

బూర్గంపాడు: మిర్చి రైతుల కంట కన్నీరు ఉబికి వస్తోంది. ధరల పతనంతో అప్పులు తీరే మార్గం కనిపించక ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నో ఆశలతో సాగు చేసిన మిర్చిని అమ్ముకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. రోజురోజుకూ పడిపోతున్న ధరలతో రైతులు మరింతగా కుదేలవుతున్నారు. ఓ పక్క సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. కూలీలు రేట్లు పెంచారు. పంట అమ్మితే కూలీల డబ్బులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. మిర్చి అమ్మకాలకు జిల్లాలో మార్కెటింగ్ సౌకర్యం లేదు. ప్రైవేట్ వ్యాపారులు కల్లాల వద్దకు వచ్చి మిర్చి కొనే పరిస్థితులు లేవు. రైతులు ఖమ్మమో, గుంటూరో, జగ్దల్‌పూరో తీసుకెళితే అక్కడ వ్యాపారులు అడిగిన కాడికి అమ్మాల్సి వస్తోంది. ప్రస్తుతం మిర్చి అమ్మకుండా కొంతకాలం నిల్వచేసుకుందామన్న కోల్డ్ స్టోరేజీలు లేవు. ఈ పరిస్థితులు మిర్చి రైతులను కలవరపెడుతున్నాయి.

25 వేల ఎకరాల్లో సాగు..

ఈ ఏడాది జిల్లాలో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగుచేశారు. గతేడాది 40 వేల ఎకరాల్లో సాగు చేయగా.. నల్ల తామరతో నిలువునా ఎండిపోయాయి. రైతులకు ఎకరాకు ఐదారు క్వింటాళ్ల దిగుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోయారు. గతేడాది మిర్చికి క్వింటాకు రూ.20 వేల వరకు ధర పలికింది. దిగుబడులు పూర్తిగా తగ్గినా కొంతమేర ధర ఉండటంతో పెట్టుబడులు సగం మేర తిరిగి వచ్చాయి. గతేడాది నష్టాలతో ఈ ఏడాది జిల్లాలో మిరపసాగు 15 వేల ఎకరాల వరకు తగ్గింది. గతేడాది అప్పులు, ఈ ఏడాది పెట్టుబడులు తిరిగి వస్తాయనే గంపెడాశలతో రైతులు మిర్చి సాగు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నల్లతామర, తెగుళ్ల రాకుండా మిర్చికి సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టారు. రసాయనిక మందులతో పాటు ఎక్కువ రేటు ఉన్న ఆర్గానిక్ మందులు కూడా రైతులు మిరపతోటలపై పిచికారీ చేశారు. మిర్చి తొలి విడత కాపులో నల్లతామర ఆశించకపోవటంతో కొంతమేర దిగుబడులు వచ్చాయి. నెలరోజులుగా నల్లతామర విజృంభిచటంతో దిగుబడులు పడిపోతున్నాయి. ఈ ఏడాది ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశముంది. తొలి, మలి విడత మిర్చి కోతలు అయిన తరువాత రైతులు కల్లాల్లో ఆరబోసి గ్రేడింగ్ చేసిన మిర్చిని అమ్ముకునేందుకు ప్రస్తుతం నానా ఇబ్బందులు పడుతున్నారు. మిర్చికి మార్కెట్‌లో క్వింటాకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే ధర పలుకుతోంది. గతంలో వ్యాపారులు కల్లాల వద్దనే మిర్చిని కొనుగోలు చేశారు. ఈ ఏడాది ధర లేకపోవటంతో వ్యాపారులు గ్రామాల వైపు రావటం లేదు. దీంతో రైతులు మిర్చి బస్తాలను లారీలు, వ్యాన్‌లలో దూర ప్రాంతాల మార్కెట్‌కు తీసుకెళ్లాల్సి వస్తోంది.

రేట్లు పెంచిన కూలీలు

మిర్చి సాగులో ఈ ఏడాది కూలీ రేట్లు బాగా పెరిగాయి. గతంలో మిర్చి కోసిన మహిళా కూలీలకు రోజుకు రూ.300 చెల్లించేవారు. ఈ ఏడాది కూలి రేటు రూ.350కి పెరిగింది. ఒక క్వింటా మిర్చి కోసేందుకు రూ.3 వేల వరకు ఖర్చవుతోంది. గ్రేడింగ్, బస్తాల్లో నింపుడు, ట్రాన్స్‌పోర్ట్‌కు క్వింటాకు మరో రూ.3 వేల వరకు ఖర్చవుతోంది. క్వింటా మిర్చి రూ.10 వేలకు అమ్మితే ఆ డబ్బులు కూలీలకు, ట్రాన్స్‌పోర్ట్‌కే సరిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మిర్చి మార్కెట్ లేకపోవటం కూడా రైతులకు శాపంగా మారింది. ప్రస్తుతం ధరలు లేకపోవటంతో కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ చేసుకోవాలన్నా జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు లేకపోవటం ఇబ్బందికరంగా మారింది. పత్తి, వరి, అపరాల పంటల మాదిరిగానే ప్రభుత్వం మిర్చికి కూడా మద్దతు ధర ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర లభించనప్పుడు ప్రభుత్వాలే రైతుల నుంచి మిర్చిని కొనుగోలు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

సగం పెట్టుబడి కూడా రాదు..



గతేడాది మిరపతోట వేస్తే ఎకరానికి రూ.లక్ష నష్టం వచ్చింది. ఆ అప్పులు తీర్చేందుకు ఈ ఏడాది మళ్లీ అప్పు చేసి మిరప తోట వేశాను. ఎకరాకు 10క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కానీ, రేటు క్వింటా రూ.10 వేలకు కూడా అడగటంలేదు. గుంటూరు, ఖమ్మం లేదా జగదల్‌పూర్ తీసుకుపోవాలంటే లారీ కిరాయి పెట్టుకోవాలి. కనీసం సగం పెట్టుబడి కూడా రాదు.

– యారం వెంకటరెడ్డి, రైతు, సంజీవరెడ్డిపాలెం

రైతులను ఆదుకోవాలి



మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. మిర్చికి కనీసం రూ.20 వేలు ధర పలికేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతులు పెట్టిన పెట్టుబడుల్లో సగం కూడా రావటం లేదు. ప్రభుత్వం ఆదుకోకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులున్నాయి. మిర్చి రైతుల తరఫున పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలకు దిగుతాం.

– బత్తుల వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి

ముదిగొండ, తల్లాడ జట్ల గెలుపు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీలో మంగళవారం ముదిగొండ, తల్లాడ జట్లు విజయం సాధించాయి. ముదిగొండ – ఏన్కూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముదిగొండ 15 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది. ఈ జట్టులో పవన్ 43 బంతులు ఆడి ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 68 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఏన్కూరు జట్టు విజయానికి సరిపడా పరుగులు చేయకపోవడంతో ముదిగొండ జట్టు గెలుపొందింది. అనంతరం తల్లాడ – జూలూరుపాడు మధ్య మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన తల్లాడ జట్టు 16ఓవర్లలో 121 పరుగులు చేసింది. ఆపై జూలూరుపాడు జట్టు 16ఓవర్లలో 100పరుగులే చేయడంతో ఓటమి పాలైంది. మ్యాచ్‌లను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరు దయాకర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్, కోచ్ ఎం.డీ.గౌస్ ప్రారంభించారు.

అధిక ధరలకు విక్రయిస్తున్న షాపులపై కేసులు



షాపులను తనిఖీ చేస్తున్న అధికారి మనోహర్

పాల్వంచ: పట్టణంలో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తున్న దుకాణాలపై జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్ మంగళవారం దాడులు నిర్వహించారు. శాస్త్రీరోడ్‌లో ఫ్యాన్సీ, ఇతర దుకాణాల్లో వస్తువులను పరిశీలించారు. ఎమ్మార్పీ లేకుండా సామగ్రి విక్రయిస్తున్నట్లు గుర్తించి రెండు కేసులు నమోదు చేశారు. రెండు నోటీసులు జారీ చేశారు. జరిమానా విధించనున్నట్లు ఆయన తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: దాడికి పాల్పడిన ముగ్గురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని నాగారంకాలనీకి చెందిన బోడ వీరన్న, చంటి, దేవి సోమవారం రాత్రి దాడి చేసి గాయపరిచారని బానోతు మంచ్యా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న బస్ క్లీనర్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)



ఆందోళన చేస్తున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బస్ క్లీనర్ దేశబోయిన శ్రీనివాస్ (56) కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. జూలూరుపాడు ఎస్ఐ బి.రవి కథనం మేరకు.. చుంచుపల్లి మండలం రాంనగర్‌కు చెందిన శ్రీనివాస్ కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ స్కూల్ బస్‌క్లీనర్ (హెల్పర్)గా పనిచేస్తున్నాడు. ఈనెల 13న విద్యార్థులను ఇళ్ల వద్ద దింపేందుకు జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం వచ్చిన శ్రీనివాస్.. బస్‌లో నుంచి విద్యార్థులను దింపుతుండగా టాటా ఏస్ వాహనం వచ్చి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అయనను కొత్తగూడెం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య రాజకుమారి, కుమార్తె యమున ఉన్నారు. యమున ఫిర్యాదు మేరకు టాటా ఏస్ వాహనం డ్రైవర్ కుర్రం రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి పేర్కొన్నారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన..

చుంచుపల్లి: శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో పాఠశాల వద్ద ఆందోళన చేసేందుకు వెళ్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ప్రధాన రహదారిపైనే ఆటోలో మృతదేహాన్ని ఉంచి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. చుంచుపల్లి, జూలూరుపాడు ఎస్ఐలు జోక్యం చేసుకొని ఆందోళన విరమించాలని చెప్పినా కుటుంబ సభ్యులు నిరాకరించారు. న్యాయం చేసే వరకు వెళ్లేది లేదంటూ భీష్మించారు. పాఠశాల యాజమాన్యం స్పందించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ఆ తర్వాత పాఠశాల వద్ద కూడా మృతదేహంతో ఆందోళన చేశారు. దీంతో స్థానిక పెద్దలు జోక్యం చేసుకుని పాఠశాల యాజమాన్యంతో మాట్లాడగా, శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మంగళవారం తెల్లవారుజామున కొత్తగూడెం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అశ్వారావుపేట శివారులో పట్టుకున్నారు. ఎస్ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని అనంతారం గ్రామ శివారులోని వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్‌బీ పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, డ్రైవర్లు అరవింద్, రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంగం గ్రామంలో ఇసుక ట్రాక్టర్...

పాల్వంచరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని సంగం గ్రామంలో మొర్రేడు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా మంగళవారం ఎస్ఐ సురేశ్ పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ నాగమళ్ల రవి, యజమాని పాకల వెంకట్రావుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్, జేసీబీ పట్టివేత



జేసీబీ, ట్రాక్టర్‌తో పోలీసులు

జూలూరుపాడు: మండలంలోని కరివారిగూడెం సమీపంలోని పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి, తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భూక్యా సక్రాం ఎలాంటి అనుమతి లేకుండా జేసీబీతో ఇసుక తవ్వి.. ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పోలీసులు వాహనాలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భూక్యా సక్రాం, ట్రాక్టర్ యజమాని భూక్యా కిషన్, డ్రైవర్ భూక్యా జశ్వంత్, సుజాతనగర్‌కు చెందిన జేసీబీ యజమాని టి.రమేశ్‌తోపాటు రాచబండ్లకోయగూడెంనకు చెందిన జేసీబీ డ్రైవర్ పద్దం హరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి వెల్లడించారు.

నిల్వ చేసిన ఇసుక సీజ్

అశ్వాపురం: మండలంలోని కుమ్మరిగూడెంలో 1000 క్యూబిక్ మీటర్ల ఇసుకను మంగళవారం తహసీల్దార్ స్వర్ణలత సీజ్ చేశారు. గతంలో శ్రీవెంకటేశ్వర ఇసుక క్వారీ ట్రైబల్ లేబర్ కాంట్రాక్ట్ మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇసుక రీచ్ నిర్వహించగా డంప్ చేసిన ఇసుక నిల్వ ఉంది. ఆ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో తహసీల్దార్ స్వర్ణలత ఆధ్వర్యంలో సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ లావణ్య, పంచాయతీ కార్యదర్శి అజహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శేఖర్‌బాబు (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ – జూలూరుపాడు గ్రామాల మధ్య రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రవి కథనం మేరకు.. చంద్రుగొండ మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన, లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న ఈసం శేఖర్‌బాబు (27) విధుల్లో చేరేందుకు తన బైక్‌పై ఖమ్మం వెళ్తున్నాడు. జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డు దాటిన తరువాత గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో శేఖర్‌బాబు మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి ఈసం కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి చెప్పారు.

ఇద్దరికి దేహశుద్ధి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఖమ్మంపాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇద్దరికి దేహశుద్ధి చేసి ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వివాహితతో గాండ్లగూడేనికి చెందిన ఓ వ్యక్తి కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో వివాహిత ఇంటికి వచ్చిన వ్యక్తిని గమనించిన స్థానికులు.. వారిద్దరినీ పట్టుకొని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసినట్లు సమాచారం. దీనిపై కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. ఎస్ఐ యయాతి రాజును వివరణ కోరగా ఘటనపై సమాచారం అందినా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఉద్యోగి నుంచి డబ్బు వసూలుకు పన్నాగం

- మహిళలను వేధించిన కేసు నమోదైందని బెదిరింపులు

ఖమ్మంఅర్బన్: సైబర్ మోసాలు రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. అలాంటి ఘటనే సోమవారం వెలుగుచూసింది. ఖమ్మం మమత రోడ్డులో నివాసముండే ఓ వ్యక్తి ఖమ్మం రూరల్ మండలంలోని పంచాయతీరాజ్‌శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు సోమవారం గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ రాగా హిందీ, ఇంగ్లిషు భాషల్లో మాట్లాడిన అవతలి వ్యక్తి బెంగళూరు పోలీసుగా చెప్పుకున్నాడు. సదరు ఉద్యోగి ఫోన్ నుంచి మహిళలకు ఫోన్ చేస్తూ వేధిస్తున్నారని, ఈ విషయమై అందిన ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదైందని చెబుతూ, సెటిల్‌మెంట్ కోసం డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో కంగారు పడిన సదరు ఉద్యోగి తన మిత్రుడు పోలీసు శాఖలో ఉండడంతో సమాచారం ఇచ్చాడు. అయితే, ఇది సైబర్ నేరగాళ్ల పనేనని పోలీసు ఉద్యోగి చెప్పడంతో తనకు వచ్చిన ఫోన్ నంబర్ వివరాలతో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉపాధి పనుల్లో రక్షణ చర్యలు పాటించాలి

డీఆర్‌డీఓ విద్యాచందన



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న విద్యాచందన

పాల్వంచరూరల్ : రోజురోజుకూ ఎండలు ముదురుతున్నందున ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు రక్షణ చర్యలు పాటించాలని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో చేపడుతున్న పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. కూలీలు ఉదయమే పనికి రావాలని, ఎండతీవ్రత పెరగకముందే ముగించాలని చెప్పారు. రోజుకు రూ.300 వేతనం వచ్చేలా కొలతల ప్రకారం పని చేయాలన్నారు. ఈజీఎస్ పథకం ద్వారా రైతులు ఫారం పాండ్‌లు నిర్మించుకోవాలని సూచించారు. పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలంటే ఆయా భూముల రైతుల అనుమతులతో రోడ్డు నిర్మించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కర్ రెడ్డి, టెక్నికల్ అధికారి రాజు, ఏపీఓ రంగా, శ్రీను, కార్యదర్శులు సాయిరాం, రవికుమార్, ఎఫ్ఏలు శంకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో తనిఖీ..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, బీసీ సంక్షేమాధికారి ఇందిర మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలకు చదువుతోనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని అన్నారు. ఆ తర్వాత హాస్టల్‌లోని మెస్, బాలికల వసతి గదులను పరిశీలించారు. విద్యార్థినులకు హాస్టళ్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేశారు.

సాగు భూములు స్వాధీనం



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బాధిత రైతులు

ఇల్లెందురూరల్: మండలంలో సమీకృత గురుకులం నిర్మాణం పేద రైతులకు శాపంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సమీకృత గురుకులాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఇల్లెందులోనూ నిర్మాణానికి అవసరమైన 20 ఎకరాల స్థలం కోసం రెవెన్యూ అధికారులు అన్వేషణ ప్రారంభించారు. పలు చోట్ల భూములు గుర్తించినప్పటికీ అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం కుదరలేదు. ఇక సింగరేణి పరిధిలో మినహాయిస్తే ఖాళీగా ప్రభుత్వ స్థలం ఎక్కడా లేదని రెవెన్యూ అధికారులు నిర్ధారించుకొని పట్టాదారు పాస్ పుస్తకాలు లేని ప్రభుత్వ సర్వే నంబర్లు కలిగి ఉన్న సాగు భూములపై కన్నేశారు. జేకేఓసీకి సమీపంలో.. 21 ఇంక్లైన్ భూగర్భ గని ఉపరితలంలో.. మున్సిపాలిటీ డంప్‌షెడ్డుకు పక్కన దశాబ్దాలుగా గిరిజనేతరుల ఆధీనంలో సాగవుతున్న భూమిని స్వాధీనం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. గతంలో సాగులో ఉన్న వారికి నేరుగా కాకుండా కార్యాలయం నోటీస్ బోర్డులో, సాగులో ఉన్న వారికి మౌఖికంగా సమాచరం ఇచ్చి వారి వద్ద ఉన్న ఆధారాలు చూపించాలని ఆదేశించారు. తాజాగా మంగళవారం సాగుభూమిలో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సమీకృత గురుకులం నిర్మాణం కోసం ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకొందని, ఎవరు వచ్చినా చర్యలు తీసుకుంటామని ఫ్లెక్సీలో ఉంది. విషయం తెలుసుకున్న బాధిత 28 మంది రైతులు తహసీల్దార్ రవికుమార్‌ను కలిసి ప్రశ్నించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు లేనందున ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ స్పష్టం చేశారు. కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకున్నట్లు రైతులు తెలిపారు.

రామాలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ



విరాళం అందజేస్తున్న మధుర-విజయరామరాజు

అశ్వాపురం: అశ్వాపురం మండలం మొండికుంటలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఎన్ఆర్ఐలు కందిమళ్ల సత్యనారాయణరెడ్డి రూ.25 లక్షలు, జాలె సుధాకర్‌రెడ్డి రూ.10 లక్షలతో పాటు మరికొందరు విరాళాలు ఇచ్చారు. తాజాగా గ్రామానికి చెందిన తిప్పారెడ్డి పిచ్చిరెడ్డి కుమార్తె – అల్లుడు గంగిరెడ్డి శ్రీలత–రాజమోహన్‌రెడ్డి దంపతులు ఆలయంలో ధూపదీప నైవేద్యాల కోసం ఏర్పాటు చేయనున్న మూలనిధికి మంగళవారం రూ.10లక్షలు విరాళంగా అందజేశారు. గతంలో మూడు గర్భాలయాలకు రూ.1.25లక్షల విలువైన సింహ ద్వారబంధాలు ఇచ్చారు. ఇక మల్లెలమడుగుకు చెందిన చల్లా మధుర–విజయరామరాజు దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేయగా, మేరెడ్డి రామిరెడ్డి–యశోదమ్మ జ్ఞాపకార్థం విగ్రహ ప్రతిష్ఠాపన రోజున 1000 మంది భక్తుల అన్నదానానికి అయ్యే ఖర్చు భరిస్తామని వారి కుమారులు మేరెడ్డి వెంకటరెడ్డి, జనార్దన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, చలపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి వెల్లడించారు. కాగా, దాతల విరాళాలతో ఆలయ నిర్మాణం చివరి దశకు చేరగా మార్చి 9న విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

22, 23వ తేదీల్లో కోలిండియా అథ్లెటిక్స్ మీట్

కొత్తగూడెంలో నిర్వహణకు ఏర్పాట్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఈ నెల 22, 23వ తేదీల్లో కోలిండియా స్థాయి(పురుషులు, మహిళలు) అథ్లెటిక్స్ మీట్ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈమేరకు వివరాలను జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) కవితానాయుడు మంగళవారం నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. కోలిండియా పరిధిలోని 10 బొగ్గు పరిశ్రమల నుంచి దాదాపు 320 మంది క్రీడాకారులు పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. పోటీలను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ప్రారంభించనుండగా, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. టోర్నీ ఏర్పాట్లు, నిర్వహణ బాధ్యతల పర్యవేక్షణ బాధ్యతలను వివిధ విభాగాల అధికారులకు అప్పగించి, రిఫరీలుగా 26మందిని నియమించామని తెలిపారు. ఈసమావేశంలో వివిధ విభాగాల అధికారులు కె.అజయ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, బి.సుశీల్‌కుమార్, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.